క్లుప్తంగా

20వ వార్డులో పూడిక తొలగింపు



పూడిక పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని 20వ వార్డు వైఎస్సార్ కాలనీలోని డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడిక తీత పనులను మున్సిపాలిటీ చేపట్టింది. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పర్యవేక్షణలో శనివారం కార్మికులు డ్రెయిన్లలోని పూడిక తొలగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కాలనీలో పర్యటించి పనులను పరిశీలించారు. డ్రెయిన్లలో పూడికలు పూర్తిగా తొలగించి, నిరాటంకంగా మురుగునీటి పారుదల సాగేలా చూడాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్డు మీద వేసిన పూడిక మట్టిని ఆలస్యం చేయకుండా బయటకు తరలించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కార్యకర్తలు గనిపే నాగభూషణం, పేరూరి మాధవి, కొమ్మోజు నాగేశ్వరరావు, శానిటరీ సెక్రటరీ వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



గొల్లపాలెంలో వర్తకులతో మాట్లాడుతున్న ఎస్సై

కాజులూరు: వ్యాపారులంతా తమ షాపుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. గొల్లపాలెంలో వర్తక సంఘం సభ్యులతో శనివారం ఎస్సై సమావేశం నిర్వహించి సీసీ కెమెరాల ఏర్పాటు, వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం షాపులను పరిశీలించి ఎక్కడెక్కడ కెమెరాలు ఏర్పాటు చేయాలనే అంశంపై వ్యాపారస్తులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వర్తకసంఘం సభ్యులు ఐ.రెడ్డి, రవి, అయ్యప్ప, రాంబాబు, వెంకన్న, నాగేశ్వరరావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న వక్తలు

కె.గంగవరం: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహణలో భాగంగా అధ్యక్షుడు దాసరి శ్రీనివాసు, రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాద్ చౌదరి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించుకున్నందుకు అభినందనలు తెలిపారు. జనవరి నెలలో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా సిద్దిల రవి, ప్రధాన కార్యదర్శిగా గణేష్, సహాధ్యక్షులుగా బి.గోపాలకృష్ణ, ఎ.లక్ష్మీసౌభాగ్య, కోశాధికారిగా శివలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

వెదురుమూడిలో..



యూటీఎఫ్ నూతన కార్యవర్గం

కపిలేశ్వరపురం: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వెదురుమూడిలో నిర్వహించిన మండల మహాసభలో సంఘం కార్యకలాపాలపై చర్చించారు. వార్షిక నివేదికను మండల అధ్యక్ష కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. భవిష్యత్ కార్యాచరణపై సంఘం జిల్లా నాయకులు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా తిరిగి శ్రీనివాస్, సూరిబాబులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎంవీ రమణారావు, సహాధ్యక్షులుగా మేడిశెట్టి అనంత సత్యనారాయణమూర్తి, జి.వెంకటలక్ష్మి, కోశాధికారిగా జీవీ భీమేశ్వరరావు, కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్‌గా వైపీ సురేంద్ర, సీపీఎస్ కన్వీనర్‌గా కేవీవీ గోవిందకుమార్, ఐక్య ఉపాధ్యాయ పత్రికా కన్వీనర్‌గా యం.భైరాం, మరికొందరిని కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచారు

- కూటమి పాలనపై ఎమ్మెల్సీ తోట ధ్వజం
- మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



మండపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు

మండపేట: తాము అధికారంలోకి 'అది చేస్తాం.. ఇది చేస్తాం' అంటూ నమ్మించి ఓట్లు వేయించుకుని తీరా గద్దెనెక్కాక కూటమి పాలకులు రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచేశారని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. అధికారం చేపట్టిన ఆర్నెల్లలోనే దోపిడీ ప్రభుత్వంగా కూటమి పాలకులు అప్రతిష్ట మూటగట్టుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండపేట పట్టణం, మండలంలో పండుగలా నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో జగన్ జన్మదిన వేడుకలను పట్టణంలోని విజయలక్ష్మి నగర్లోని ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నేతలు కర్రి రెడ్డి రాధాకృష్ణ, కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సమక్షంలో తోట త్రిమూర్తులు భారీ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం స్థానిక రాజారత్న జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు తన ప్రసంగంలో కూటమి ప్రభుత్వ దోపిడీ పాలనపై విమర్శలు గుప్పించారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీలు కుడుపూడి భవాని, మంగాదేవి, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నౌడు వెంకటరమణ, మేడిశెట్టి సత్యవేణి, సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, వరదా చక్రవర్తి, కౌన్సిలర్లు నీలం దుర్గమ్మ, జొన్నపల్లి విజయలక్ష్మి, ఎర్నేని ప్రభావతి, మొండి భవాని, నాయకులు గొలుగూరి సందీప్, చిర్ల జయరామ్‌రెడ్డి, గారపాటి అశోక్‌కుమార్, శిరిపురపు శ్రీనివాస్, పెంకే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

మండలంలోని అర్తమూరు గ్రామంలోని కనకదుర్గమ్మ సెంటర్లో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. అలాగే ఏడిద బల్లగేటు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ద్వారపూడిలో దుప్పట్ల పంపిణీ

ద్వారపూడిలో సర్పంచ్ ఈతకోట కిన్నెర ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దంతులూరి వర్మ, తులా శేషారావు, పోతుల రాంబాబు, పోతుల ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిగా జనం గుండెల్లో జగన్

కపిలేశ్వరపురం: సామాన్యుల సంక్షేమ సారథిగా దేశ చరిత్రలో కనీ వినీ ఎరుగని పాలన అందించిన వైఎస్ జగన్ జనం గుండెల్లో నిలిచారని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో శనివారం అంగరలోని వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. స్వీట్లు పంచారు. మండలంలోని మాచర, వడ్లమూరు, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో వేడుకను జరుపుకొన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండపేటలో నిర్వహించిన వేడుకకు మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, కాలేరు, నల్లూరు, తాతపూడి, టేకి, వాకతిప్ప, నాగులచెరువు, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల పార్టీ శ్రేణులు హాజరయ్యాయి. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, వాసంశెట్టి సునీత, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, గొల్లపల్లి సోనియా, నాయకులు వాసంశెట్టి విష్ణుమూర్తి, పాలింగి కృష్ణ కిశోర్, కట్టా మురళి, మేడిశెట్టి దుర్గారావు, పీతల శ్రావణ్‌కుమార్, పట్నాల పట్టాభి రామయ్య, రాయుడు జగపతి, గెద్దాడ రామకృష్ణ, కవల శీను, సుబ్బారావు, షేక్ రెహమాన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగరలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ సత్యవేణి, నాయకులు



రాయవరం మండలం సోమేశ్వరంలో సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో..

రాయవరం: సోమేశ్వరంలో సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. చెల్లూరులో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చోడె వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో సొసైటీ మాజీ అధ్యక్షుడు చిక్కాల శ్రీరాములు, పార్టీ నాయకులు పాలిక గోవిందు, పాలిక శ్రీను, కొండేపూడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. వి.సావరంలో ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు సిరికి కృష్ణారావు, కాకి కోటేశ్వరరావు, గుత్తుల లాల్ కిషోర్, పంపన గోవిందు, గుత్తుల రాజేష్, పిల్లి చంద్రశేఖర్, వీరబాబు తదితరులు కేక్ కట్ చేశారు.

చరిత్రలో సువర్ణాధ్యాయం జగన్ పాలన

- వాడవాడలా జగన్ జన్మదిన వేడుకలు
- కేక్ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న కోఆర్డినేటర్లు, నాయకులు



ద్రాక్షారామలో పేదలకు రగ్గులు, స్వీట్లు అందజేస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు



గొల్లపాలెంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉంగరాల లక్ష్మణరావు

రామచంద్రపురం: పేదల సంక్షేమంతో పాటుగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధికి బాటలు వేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ నేతలు కార్యకర్తలు తరలివచ్చిన వారితో కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ జగన్ పాలనలో నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తే అలవిగాని హామీలను సూపర్ సిక్స్ పేరుతో కూటమి నేతలు ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కారన్నారు. ప్రజలు అధికారాన్ని అందిస్తే సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మళ్లీ మోసం చేస్తుందని విమర్శించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండుగల గోవిందరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ టీడీపీ నేత కొత్త సంప్రదాయం

నియోజకవర్గంలో గతం నుంచి కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి స్థానిక టీడీపీ నేతలు సభ్యత్వ నేతలు కొత్త సంప్రదాయానికి తెరతీశారని విమర్శించారు. గతానికి భిన్నంగా ప్రస్తుత టీడీపీ నేత నియోజవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లతోనూ, డ్వాక్రా యానిమేటర్లతోనూ టీడీపీ సభ్యత్వ నమోదును చేయడం ద్వారా ఆపార్టీ నియోజకవర్గంలో ఎంత పటిష్టంగా ఉందనేది అర్థమవుతుందన్నారు. గతంలో నియోజకవర్గంలో టీడీపీ సంస్థాగతంగా పటిష్టంగా ఉందని గొప్పలు చెప్పుకున్న వారు ఈ రోజున ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా యానిమేటర్లకు టీడీపీ సభ్యత్వాలు చేయాలని టార్గెట్లు ఇవ్వటం సిగ్గుచేటని సూర్యప్రకాశ్ విమర్శించారు.

కాజులూరులో..

కాజులూరు: రాష్ట్ర చరిత్రలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని వైఎస్సార్ యువసేన జాతీయ అధ్యక్షుడు ఉంగరాల లక్ష్మణరావు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేకులు కట్ చేసి స్వీట్లు పంచారు. గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో పలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. మండలంలోని కుయ్యేరులో సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, గొల్లపాలెంలో ఎంపీటీసీ జొన్నకూటి పద్మ, తణుకువాడలో మాజీ ఎంపీటీసీ పితాని సుబ్రహ్మణ్యం, కాజులూరు శివారు చాకిరేవుమెరకలో పార్టీ నాయకులు పెంకే సత్యనారాయణ, శలపాకలో పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు పొలినాటి సూర్యచంద్రం, దుగ్గుదుర్రులో పోతు శ్రీనివాసుల ఆధ్వర్యంలోనూ పార్టీ నాయకులు జగన్ పుట్టినరోజు కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, చొల్లంగి వెంకన్న, మాదిరెడ్డి చిన్ని, పృథ్వీరాజ్, దుబాయ్ శ్రీను, పెంకే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: జననేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని ద్రాక్షారామ బోస్‌బొమ్మ సెంటర్‌లో శ్యామ్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ నేతృత్వంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ మాత భారతి, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం రిక్షా కార్మికులు, నిరుపేదలకు రగ్గులు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్‌కుమారి, అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి దొరబాబు, పిల్లి కృష్ణమూర్తి, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎస్సార్ ట్రస్టు సేవలు ఆదర్శనీయం

అర్తమూరులో ఉచిత హోమియో వైద్య శిబిరం



రోగులకు హోమియో మందు వేస్తున్న వైస్ చైర్మన్ లక్ష్మణరెడ్డి

మండపేట: ఎస్‌బీఎస్సార్ ట్రస్టు ద్వారా సత్తి బులి స్వామి రెడ్డి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పందలపాక హైస్కూల్ ఉపాధ్యాయుడు చిర్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్తమూరులో శనివారం ఈ ట్రస్టు ఆధ్వర్యంలో 178వ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో వైద్యశాల సౌజన్యంతో నిర్వహించిన శిబిరానికి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. డాక్టర్ విజయకుమారి పర్యవేక్షణలో హోమియో వైద్యులు సుమారు 200 మంది రోగులకు సేవలు అందించారు. అవసరమైన వారికి నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ లక్ష్మణరెడ్డి, కన్వీనర్ కోనాల సత్తిరెడ్డి మాస్టారు, ఉద్దగిరి ఆంజనేయులు, మండా నాగిరెడ్డి, పద్మావతి, జీవివి మూర్తి, సత్తి సత్యనారాయణరెడ్డి మాష్టారు, తాడి సుబ్బారెడ్డి, వెలగల శివారెడ్డి, చింతా వెంకట కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, తాడి రామారెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, పీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత లోపిస్తే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ మధుసూదనరావు
- ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక
- పనుల్లో అవకతవకల గుర్తింపు
- ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీకి ఆదేశం



కపిలేశ్వరపురం సామాజిక తనిఖీలో నివేదికను వెల్లడిస్తున్న డీఆర్పీలు

కపిలేశ్వరపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో పారదర్శకత లోపిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల సామాజిక తనిఖీ నివేదికలను గ్రామాల వారీగా పరిశీలించారు. 16వ విడతగా ఈ ఏడాది డిసెంబర్ 6 నుంచి 20 వరకూ గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల నుంచి వివరాలను సేకరించారు. పనుల అంశాలు వివరించగా ప్రజా క్షేత్రంలో తనిఖీ చేశారు. మండలంలోని 19 గ్రామాల్లో ఏడాది కాలంలో రూ.7,82,60,645లతో 1,019 పనులను చేపట్టారు. వాటి తాలూక తీరును కూలీలు, రైతుల సమక్షంలో తనిఖీ చేశారు. చేపట్టిన పనికి, రికార్డుల్లో రాతలకు వ్యత్యాసాలను గుర్తించారు. పలు రికార్డుల్లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా చెల్లింపులు జరిపినట్టు నిర్ధారణ అయ్యింది. క్షేత్ర స్థాయిలో రికార్డుల్లో చూపినట్టు మొక్కలు లేకపోవడమూ, మస్టర్లలో వ్యత్యాసాలు, నేమ్ బోర్డులు లేకుండా చెల్లింపులు జరపడమూ, హాజరు పట్టికలో దిద్దుబాటులను గుర్తించారు. ఆయా లోపాలను మండల స్థాయి ప్రజావేదికలో చదివి వినిపించారు. వాటికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు నుంచి రికవరీ చేయాలని పీడీ మధుసూధనరావు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రత్నకుమారి, ఏపీడీ కె.సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ వి.కనకారావు, ఏపీఓ రవికిరణ్, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గణిత జ్ఞాన సంపన్నుడు రామానుజన్



మాచరలో రామానుజన్ సంఖ్య 1729 ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు

కపిలేశ్వరపురం: శ్రీనివాస రామానుజన్ గణిత జ్ఞాన సంపన్నుడని, ఆయనను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు వేర్వేరు మొత్తంగా రెండు రకాలుగా వ్యక్తీకరించగలిగిన అతి చిన్న సంఖ్యను రామానుజన్ కనిపెట్టారు. ఆ నేపథ్యాన్ని పురస్కరించుకుని రామానుజన్ సంఖ్యగా పిలుచుకునే 1729 సంఖ్య ఆకారంలో ఏర్పడి రామానుజన్ ఖ్యాతిని వ్యక్తం చేశారు. విద్యార్థులను హెచ్‌ఎం రమాదేవి అభినందించారు. గణిత శాస్త్ర ప్రాధాన్యతను గణిత ఉపాధ్యాయులు శ్రీహరి, బాలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు దళిత నాయకుల నిరసన



కలువపువ్వు సెంటర్లో నిరసన తెలుపుతున్న కార్మికులు



కె.గంగవరంలో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

కె.గంగవరం: ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలపై మండలంలోని దళిత నాయకులు శనివారం మండల కేంద్రం కె.గంగవరం మెయిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రవ్వా భూషణం, కోటి వెంకట్రావు, బత్తుల అప్పారావు, ఈరెల్ల రాజు, దున్నా అన్నవరం, గిడ్డి వీరప్రసాద్, పాము భాస్కరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు చింతా రాజారెడ్డి, గుబ్బల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ పార్లమెంటులో అంబేడ్కర్‌ని అవమానించడమంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. అమిత్ షాను తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్‌పై ఏ రాజకీయ నాయకుడైనా అవమానించే విధంగా ప్రవర్తిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

మండపేట: బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. అంబేడ్కర్ ఫ్లెక్సీ పట్టుకుని కలువపువ్వు సెంటర్లో వారు నిరసన తెలిపారు. అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వారు తప్పుబట్టారు. అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. వెంటనే మంత్రి పదవికి రాజీనామా భారత జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. సీఐటీయూ నాయకురాలు కె. కృష్ణవేణి, నాయకులు కొమారపు నరేంద్రకుమార్, బంగారు కొండ, రాజు, అశోక్, లోవరాజు, అప్పారావు, రమేష్, సత్యనారాయణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిప్పంటించుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

మండపేట: పట్టణంలోని నాయుళ్ల రామాలయం సమీపంలోని అక్కలవారి వీధిలో నివాసం ఉంటున్న దుగ్గిరాల విజయలక్ష్మి (55) శనివారం సాయంత్రం తన ఇంట్లో వంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. బాధితురాలు బాధతో కేకలు వేయడంతో స్థానికులు, బంధువులు గమనించి మంటలు ఆర్పారు. 108లో ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించాక మెరుగైన వైద్యం నిమిత్త కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయలక్ష్మికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై బంధువు దుగ్గిరాల వీరభద్రరావు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్ఐ హరికోటిశాస్త్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈమె రెండు నెలల క్రితం జారి పడిపోవడంతో తలకు బలమైన గాయం కాగా అసుపత్రిలో వైద్యం చేయించి మందులు వాడినట్టు తెలిపారు. అప్పటి నుంచి బాధితురాలికి మతిస్థిమితం లేనట్టు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే..

కపిలేశ్వరపురం: భూ హక్కు పత్రాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యల పరిష్కారానికై గ్రామ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. కోరుమిల్లిలో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ప్రభుత్వ రెవెన్యూ విధానాన్ని తహసీల్దార్ వివరించారు. భూయాజమాన్య హక్కుల్లోని సమస్యల పరిష్కారాన్ని కోరుతూ యాజమానులు వినతి పత్రాలు అందజేశారు. వాటిని పరిష్కరించి సరిచేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

రాయవరం: మాచవరంలో తహసీల్దారు ఐ.పి.శెట్టి ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నెల 10న ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిశాయి. ఈ సదస్సుల్లో మొత్తం 74 అర్జీలను రెవెన్యూ శాఖ ప్రజల నుంచి స్వీకరించింది. మ్యుటేషన్లు కోరుతూ 16, అడంగల్‌లో సవరణలు కోరుతూ 16, సబ్-డివిజన్లు చేయాలంటూ 32, విస్తీర్ణ వ్యత్యాసం సరిచేయాలని కోరుతూ 10 మంది దరఖాస్తులు అందజేశారు. 10 రెవెన్యూ సదస్సుల్లో 355 మంది రైతులు పాల్గొన్నట్టు తహసీల్దారు శెట్టి తెలిపారు.